పాడికి ప్రోత్సాహకం.. లక్ష్యం దూరం



● ఉమ్మడి జిల్లాలో మూడు పాల శీతలీకరణ కేంద్రాల పరిస్థితి

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం

పాడి రైతును ప్రోత్సహించేలా వారి నుంచి మద్దతు ధరకు పాలు కొనుగోలు చేసి విక్రయించేందుకు ప్రభుత్వం పాల శీతలీకరణ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతన్నల కోసం ఆదిలాబాద్ పట్టణంలో తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య కార్యాలయాన్ని ఏర్పాటుచేసి ఇక్కడి నుంచే కార్యకలాపాలు సాగిస్తోంది. కొనుగోలు చేసిన పాలను ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ వసతిగృహాలు, కస్తూర్బాలు, గురుకులాలకు ప్యాకెట్ల రూపంలో సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 2021లో మూడుచోట్ల రూ.18 కోట్లతో అందుబాటులోకి తెచ్చిన ఈ కేంద్రాల్లో పరికరాలు భారీ వ్యయంతో ఏర్పాటు చేసినా డిమాండ్‌కు తగ్గ పాలు సరఫరా కావడం లేదు. గతంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదిలాబాద్‌లోని ఈ పాల కేంద్రంలో 2 వేల లీటర్ల కంటే ఎక్కువ పాలు కొనుగోలు చేసేవారు కాదు. ప్రస్తుతం ఉన్న అధికారుల చొరవతో ఇది మూడింతలు దాటింది. కానీ ఈ కేంద్ర సామర్థ్యానికి ఉన్న లక్ష్యం ఎప్పటికీ నెరవేరదనడంలో సందేహం లేదు.

◆ మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో రూ.6 కోట్లతో 20 వేల లీటర్ల పాల శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడ 6 వేల నుంచి 7 వేల లీటర్ల కంటే ఎక్కువ పాలు రావడం లేదు. ఫలితంగా 10 వేల లీటర్ల సామర్థ్యంలో ఉన్న స్టోరేజీ ట్యాంకులు రెండు నిరుపయోగంగా ఉంటున్నాయి.

◆ నిర్మల్ జిల్లా సోఫీనగర్‌లో రూ.3 కోట్లతో 10 వేల లీటర్ల సామర్థ్యంతో 2021లోనే పాల శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడ పరికరాలు, స్టోరేజీ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. పరికరాలు అధ్వానంగా ఉండడంతో ఈ కేంద్రాన్ని మూసివేశారు. రైతుల కోసం అక్కడే రూ.50 లక్షల వ్యయంతో కొత్తగా కేంద్రాన్ని ఏర్పాటు చేసి నెట్టుకొస్తున్నారు.

ఈ మూడు కేంద్రాల కోసం రూ.14.60 కోట్లు, ఇతర ఖర్చులకు మరో రూ.3.40 కోట్లు.. మొత్తం కలిపి రూ.18 కోట్లు వెచ్చించారు. కానీ ప్రయోజనం అంతంతమాత్రమే.

ఆదిలాబాద్ పట్టణం గాంధీ పార్కు పక్కన పాల శీతలీకరణ కేంద్రంలో మూడేళ్లుగా ఉపయోగంలోకి రాని స్టోరేజ్ ట్యాంకులివి. ఒక్కో ట్యాంకు సామర్థ్యం 10 వేల లీటర్లు. రెండు ట్యాంకులు కలిపి 20 వేల లీటర్ల వరకు పాలు నిల్వ చేయొచ్చు. ఇదే కేంద్రంలో 5 వేల లీటర్ల ట్యాంకు మరో రెండు, చిన్న ట్యాంకులు మరో మూడు ఉన్నాయి. మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. ఇక్కడ మొదటి నుంచి రైతులు పాలు విక్రయించేందుకు అంతగా రావడం లేదు. కానీ రూ.5.60 కోట్లతో 20 వేల లీటర్లకంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన యూనిట్‌ను ఏర్పాటు చేశారు. అధికారులు కష్టపడి ప్రస్తుతం 7 వేల నుంచి 8 వేల లీటర్ల వరకు రోజూ కొనుగోలు చేస్తున్నారు.



విక్రయాలు పెరిగాయి..

- మధుసూదన్, డెయిరీ డిప్యూటీ డైరెక్టర్

రైతులకు పాలలో వెన్న ఆధారంగా చెల్లింపులు చేస్తున్నాం. ప్రస్తుతం సరాసరి లీటరుకు రూ.55 నుంచి రూ.60 వరకు అందిస్తున్నాం. 50 శాతం రాయితీపై పశు దాణా, పశువులలో పాల ఉత్పత్తి పెంచేందుకు 32 రకాల లవణాలు ఉండే మినరల్ మిక్చర్ తక్కువ ధరకు ఇస్తున్నాం. గడ్డి విత్తనాలు తక్కువ ధరకే అందిస్తున్నాం. ప్రోత్సాహకాలు అందించడంతో గతంలో కంటే పాల విక్రయాలు పెరిగాయి.

25న కుంరం సూరు వర్ధంతి

ఉట్నూరు: ఉట్నూరు మండలం దంతన్‌పల్లి పంచాయతీ న్యూకొలాంగూడలో 25న ఆదివాసీ కొలాం వీరుడు కుంరం సూరు వర్ధంతిని నిర్వహించనున్నట్లు ఆదివాసీ నాయకులు పేర్కొన్నారు. వర్ధంతి గోడప్రతులను శుక్రవారం ఉట్నూరులో ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయిలు ఆవిష్కరించారు. ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, కొలాం సంఘం నాయకులు పాల్గొన్నారు.

పత్తి రైతుకు మద్దతు ధర దక్కాలి

● కలెక్టర్ రాజర్షి షా



పత్తి తేమ యంత్రం పనితీరును పరిశీలిస్తున్న పాలనాధికారి రాజర్షి షా

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : పత్తి రైతుకు మద్దతు ధర దక్కాలని, అందుకు అధికారులు కృషి చేయాలని పాలనాధికారి రాజర్షిషా స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మార్కెటింగ్, ఐకేపీ, సీసీఐ, వ్యాపారులతో ఆయన సమావేశమయ్యారు. పత్తి కొనుగోళ్లపై చర్చించారు. తొలుత తేమను ఏవిధంగా నిర్ధారించాలో ఐకేపీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. యార్డులో మార్కెటింగ్ సిబ్బంది, జిన్నింగులో ఐకేపీ సిబ్బంది తేమను పరిశీలించనున్న నేపథ్యంలో తేమ యంత్రాలను ఎలా వినియోగించాలో పాలనాధికారి స్వయంగా పర్యవేక్షించారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేకరించిన పత్తిని వేర్వేరుగా తేమను పరిశీలించారు. కుప్పలుగా పోసిన పత్తి నుంచి సేకరించిన తేమ శాతం నమోదు చేశారు. ఇందులో ఉదయం 9 గంటల్లోపు సేకరించిన పత్తిలో ఎక్కువ తేమ నమోదు కాగా.. ఆ తర్వాత సేకరించిన పత్తిలో తక్కువగా నమోదైంది. రైతులకు ఈ విషయమై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. తేమ యంత్రానికి సిబ్బంది చేతివేళ్లు తాకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

23 లేదా 25న ముహూర్తం?

పత్తి పంట ఇప్పటికే చేతికి వస్తున్నందున ఈ నెల 23 లేదంటే 25వ తేదీ నుంచి కొనుగోళ్లు చేపట్టాలని పాలనాధికారి అధికారులను, వ్యాపారులకు సూచించారు. తేమ 8-12 శాతం నడుమ నమోదైతేనే సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపడుతున్నందున ఆపై తేమ నమోదైతే వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ విషయంలో వ్యాపారులు రైతుల పక్షాన ఆలోచించాల్సిన అవసరముందని నొక్కిచెప్పారు. సమావేశంలో అదనపు పాలనాధికారి శ్యామలదేవి, మార్కెటింగ్ అధికారి గజానన్, కార్యదర్శి మధుకర్, సహాయకార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచార ప్రతులను ఆవిష్కరిస్తున్న డీఎస్పీలు సోమనాథన్, జీవన్‌రెడ్డి తదితరులు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నిజామాబాద్ రేంజ్ నార్కొటిక్ డీఎస్పీ ఎం.సోమనాథన్ అన్నారు. శుక్రవారం యాంటీ నార్కొటిక్ బ్యూరో ఆధ్వర్యంలో పట్టణంలోని నలంద కళాశాలలో మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రచార ప్రతులను ఆవిష్కరించారు. షీ టీమ్ సేవలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు వివరించారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ సురేందర్‌రెడ్డి, సీఐ ప్రసాద్, సైబర్ క్రైమ్ సిబ్బంది రియాజ్, కళాశాల ప్రిన్సిపల్ పున్నారావు, వైస్ ప్రిన్సిపల్ విజయ్ గోపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'శక్తి అభియాన్'కు ఆత్రం సుగుణ



కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీతో ఆత్రం సుగుణ

ఆదిలాబాద్ అర్బన్, ఉట్నూరు, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అధ్యక్షతన శుక్రవారం దిల్లీలో నిర్వహించిన శక్తి అభియాన్ కార్యక్రమానికి ఆదిలాబాద్ పార్లమెంటు ఇన్‌ఛార్జి ఆత్రం సుగుణ హాజరయ్యారు. అన్ని రంగాల్లో మహిళలకు సమానత్వాన్ని కల్పించడం, రాజకీయాల్లో మహిళలను ప్రోత్సహించడమే లక్ష్యంగా శక్తి అభియాన్, ఇందిరా ఫెలోషిప్ పనిచేస్తుందని రాహుల్‌గాంధీ వివరించినట్లు ఆమె పేర్కొన్నారు.

నైపుణ్యమే అధనం..

● టాస్క్ శిక్షణతో ఉద్యోగావకాశాలు

చదువులో రాణించాలన్నా.. ఉద్యోగం సాధించాలన్నా నైపుణ్యం ఒడిసిపట్టాల్సిందే. విద్యార్థి జీవితంలో ఇంటర్ తర్వాత వేసే ప్రతి అడుగు అత్యంత కీలకం. ఈ దశలో రూపుదిద్దుకున్న తీరు ఉన్నతి వైపు నడిపిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దేందుకు టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్) కృషి చేస్తోంది. అవకాశాలు కోల్పోతున్న యువతలో అత్యున్నత నైపుణ్య వికాసంపై శిక్షణ ఇస్తోంది. సాధారణ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా వివిధ రంగాల్లో రాణించేందుకు వారి భవితకు చేయూతనిస్తోంది.

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే



ఉద్యోగాలకు ఎంపికైన పలువురు విద్యార్థులు



యువతలో నైపుణ్యాలు పెంపొందించి ఉద్యోగ సాధనకు మార్గాన్ని సులువుగా చేయడమే లక్ష్యంగా టాస్క్ ముందుకు సాగుతోంది. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఫార్మసీ, ఎంబీఏ ఇతర విద్యను అభ్యసించే విద్యార్థులకు వివిధ అంశాల్లో తర్ఫీదు అందిస్తోంది. టాస్క్‌లో నమోదు చేసుకోవడం ద్వారా నైపుణ్య అంశాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు వివిధ సందర్భాల్లో సంస్థలు, పరిశ్రమల సహకారంతో నిర్వహించే ఉద్యోగ మేళాల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. తెలంగాణ అకాడమీ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో గత ఏప్రిల్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో పలువురు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గత విద్యాసంవత్సరంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 45 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల నమోదు ప్రక్రియ చేపట్టగా 1400 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆయా కళాశాలల్లో టాస్క్ శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

వివిధ అంశాలపై...

కళాశాల స్థాయిలో 40 నుంచి 50 మందిని బ్యాచ్‌లుగా విభజిస్తారు. ప్రతి విద్యార్థికి అర్థమెటిక్ అండ్ రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్, ఒక సాంకేతిక కోర్సు బోధిస్తారు. ప్రముఖ కార్పొరేట్, ఐటీ కంపెనీలకు క్షేత్రస్థాయి పర్యటనలకు తీసుకెళ్తారు. సామర్థ్యాలను పరీక్షించి ప్రతిభ ఆధారంగా ధ్రువపత్రాలు అందిస్తారు. ఉద్యోగ నియామకాల సమయంలో టాస్క్ ధ్రువపత్రానికి ప్రాధాన్యమిస్తారు.



మంచిర్యాల సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో టాస్క్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

మెలకువలు నేర్పించారు

సాక్షి అగర్వాల్, మంచిర్యాల



డిగ్రీలో చేరగానే టాస్క్‌పై అధ్యాపకులు అవగాహన కల్పించడంతో ప్రవేశం పొందా. ఉద్యోగ నైపుణ్య మెలకువలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన మేళాలో పాల్గొని ఇంటర్వ్యూని ధైర్యంగా ఎదుర్కొని స్థానిక పిరమల్ క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం సాధించా.

శిక్షణతో ఆత్మస్థైర్యం పెరిగింది

డి. లహరి, మంచిర్యాల



టాస్క్ శిక్షణలో ఉద్యోగానికి అవసరమైన మెలకువలు నేర్పించారు. సంస్థలు నిర్వహించే ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలనే అంశాలు వివరించారు. వ్యక్తిత్వ వికాసం నైపుణ్యాలపై పట్టు సాధించా. డిగ్రీ పూర్తికాగానే ప్రాంగణ నియామకాల్లో ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగం లభించింది.

మంచి అవకాశం

బి.దీపరెడ్డి ఉమ్మడి జిల్లా టాస్క్ రిలేషన్‌షిప్ మేనేజర్



టాస్క్ ద్వారా వివిధ కోర్సుల్లో అవగాహన కల్పిస్తూనే ఉపాధి పొందేందుకు సాయం అందిస్తున్నాం. ముందే రూపొందించుకున్న కార్యాచరణను పక్కాగా అమలు చేస్తున్నాం. అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ పలు కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం. ప్రస్తుత సంవత్సరం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది.

45	ఉమ్మడి జిల్లాలో టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న కళాశాలలు మొత్తం	డిగ్రీ కళాశాలలు	35	పాలిటెక్నిక్	6	పీజీ	3	ఇంజినీరింగ్	1	1150	గతేడాది నమోదు చేసుకున్న విద్యార్థులు	256	ఉద్యోగాలకు ఎంపికైనవారు	

చినుకుపడితే.. పంటకు రక్షణేది!

● ఇచ్చోడ మార్కెట్ యార్డులో కనీస సౌకర్యాలు కరవు



న్యూస్‌టుడే, ఇచ్చోడ

అన్నదాతకు విత్తనం వేసిన నుంచి పంట చేతికొచ్చి విక్రయించే వరకు భయమే. మార్కెట్ యార్డుకు తీసుకెళ్లినా పంట అక్కడ కాంటా అయ్యే వరకు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే. వర్షం కురిస్తే పంట తడవకుండా కాపాడుకోవాల్సిందే. ఏళ్లు గడుస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించకపోవడం అన్నదాతలకు శాపంగా మారింది. మరోవైపు నిధులు ఉన్నా వాటిని ఖర్చు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఇచ్చోడ మార్కెట్ యార్డు దుస్థితిపై కథనం.

ఇచ్చోడ మార్కెట్ యార్డు పరిధిలోకి ఇచ్చోడ, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, సిరికొండ మండలాలు వస్తాయి. వారు తెచ్చిన పంట కాంటా అయ్యే వరకు అక్కడ వేచి ఉండాల్సిందే. ఇలాంటి పరిస్థితిలో వర్షం కురిస్తే ధాన్యం పూర్తిగా తడిసిపోతుంది. ప్రస్తుతం ఒకే షెడ్డు ఉంది. అది కూడా చిన్నపాటి వర్షం కురిసినా నీటి ధారలు లోపలికి వస్తున్నాయి. మరో రెండు గద్దెలు ఉండగా వాటిపై షెడ్లు వేయాల్సిన అవసరం ఉంది. రైతు విశ్రాంతి భవనం అస్తవ్యస్తంగా మారింది. రైతు అక్కడ ఉండే పరిస్థితి లేదు. కనీస సౌకర్యాలు లేవు. ఇప్పటికే మార్కెట్ యార్డుకు రూ.1.45 కోట్లు వచ్చినా వాటిని ఖర్చుచేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు.



పంటను ఆరబెడుతున్న రైతు



షెడ్లు లేని గద్దెలు



అధ్వానంగా రైతు విశ్రాంతి భవనం

ఇబ్బంది పడుతున్నాం..

- రాము, అడెగామ(కె), రైతు



పంటను మార్కెట్ యార్డుకు తీసుకొచ్చినా కాంటా అయ్యే వరకు ఎంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. పూర్తిస్థాయిలో షెడ్లు లేక ఆరుబయటే పంటను ఉంచాల్సి వస్తోంది. చిన్నపాటి వర్షం కురిసి ధాన్యం తడిసినా మరి కొన్ని రోజులు ఆరబెట్టాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి షెడ్లు వేయించాలి.

వసతులు కల్పించాలి

- దేవేందర్, రైతు పిప్పిరి, బజార్‌హత్నూర్



ఆరుగాలం శ్రమించి పంటను మార్కెట్ యార్డుకు తీసుకొస్తే ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. షెడ్ల నిర్మాణం లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మరోవైపు విశ్రాంతి భవనం సరిగా లేక ఆరుబయటే ఉండాల్సి వస్తోంది. సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి.

రిమ్స్‌లో పకడ్బందీ తనిఖీలు

ఆదిలాబాద్ వైద్య విభాగం: రిమ్స్‌లో భద్రతను కట్టుదిట్టం చేయటంతో పాటు సందర్శకులు ప్రమాదకర వస్తువులు లోనికి తీసుకెళ్లకుండా తనిఖీలు ముమ్మరం చేశారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచారం అనంతరం ఆసుపత్రుల్లో భద్రతను పెంచాలన్న వైద్య శాఖ ఆదేశాల మేరకు రిమ్స్ యాజమాన్యం ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. రోగులను పరామర్శించేందుకు వచ్చే సందర్శకులు, సహాయకులను సైతం భద్రతా సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

ఖానాపూర్ కాలనీవాసులకు ఊరట

● చెరువు వద్ద మురుగుశుద్ధి కేంద్ర నిర్మాణం లేనట్లే..

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్

జిల్లా కేంద్రంలో ఖానాపూర్ చెరువు వద్ద నిర్మించతలపెట్టిన మురుగుశుద్ధి కేంద్రం(సెవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్-ఎస్టీపీ)పై ప్రభుత్వం వెనక్కి తగ్గింది. చెరువును ఆక్రమించుకుని దశాబ్దాల కిందట స్థిర నివాసాలు వెలియడంతో ఇటీవల అధికారులు సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. చెరువు పూర్తిస్థాయి నీటి మట్టం, బఫర్‌జోన్‌లో ఎన్ని నివాసాలు ఉన్నాయో లెక్క తేల్చేందుకు బల్దియా, రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేయగా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ప్రతిపక్షాలు ఆందోళన చేయడం, అధికార పక్షం సైతం సర్వేను నిలిపివేయాలని కోరడంతో ప్రభుత్వ యంత్రాంగం పునరాలోచనలో పడింది. రెండురోజులకే సర్వేను నిలిపివేశారు. ప్రత్యామ్నాయంగా మురుగు చెరువులో కలవకుండా భారీ పైప్‌లైన్ ఏర్పాటు చేసి దాని ద్వారా చాందా వాగువైపు తరలించి అక్కడ మురుగు శుద్ధి చేసి బయటకు వదలాలనే ఆలోచన తెరపైకి వచ్చింది.

నాలుగు చోట్ల ఎస్టీపీల నిర్మాణం

బల్దియాలో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమృత్ 2.0 పథకం కింద గతేడాది రూ.225.46 కోట్ల నిధులు మంజూరైన విషయం తెలిసిందే. చెరువులు, వాగుల్లో మురుగు కలిసి జలకాలుష్యం జరగకుండా వాటి సమీపంలో మురుగుశుద్ధి కేంద్రాల(ఎస్టీపీ)ను నిర్మించి, అక్కడ శుద్ధి చేశాకే వాగులు, చెరువుల్లోకి వదిలేందుకు ప్రభుత్వం ప్రణాళికలు వేసింది. ఇందులో భాగంగా తొలుత ఖానాపూర్ చెరువుతో పాటు అనుకుంట, ఇందిరమ్మ కాలనీ, కేఆర్కే కాలనీ, చిల్కూరి లక్ష్మీనగర్ వద్ద అయిదుచోట్ల ఎస్టీపీలను నిర్మించాలని నిర్ణయించింది. ఇందులో ఖానాపూర్ చెరువే ప్రధానమైనది. చెరువు చాలా భాగం ఆక్రమణకు గురైంది. అక్కడ ఎస్టీపీ నిర్మించాలంటే స్థలం అవసరం. స్థల సేకరణ కోసం ఖానాపూర్ చెరువు పరిధిలోని నివాసాలపై సర్వే చేశారు. ఎస్టీపీల నిర్మాణానికి భూసేకరణకు సైతం రూ.10 కోట్లు మంజూరు చేయడంతో అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి ప్రత్యామ్నాయం చూపాలని అధికారులు భావించారు. వారు వ్యతిరేకించడంతో అక్కడ ఎస్టీపీ నిర్మించాలన్న నిర్ణయంపై వెనక్కి తగ్గారు. మిగతా నాలుగుచోట్ల మాత్రం యథావిధిగా ఎస్టీపీలను నిర్మించనున్నారు.



మురుగునీటికి ఆవాసంగా మారిన ఖానాపూర్ చెరువు



నాలా నుంచి వచ్చే మురుగునీటిని పైప్‌లైన్ వేసి చిల్కూరి లక్ష్మీనగర్ వద్ద నిర్మించే ఎస్టీపీకి కలపనున్నారు. అక్కడ శుద్ధిచేసి చాందా వాగులోకి వదలనున్నారు.

పైప్‌లైన్ ఏర్పాటు..

ఖానాపూర్ చెరువు వద్ద ఎస్టీపీ నిర్మాణానికి బదులుగా అందులో మురుగునీరు రాకుండా ప్రత్యేకంగా భారీ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. చెరువులోకి వచ్చే ప్రధాన మురుగు కాల్వను కట్ట పక్క నుంచి పాత జాతీయ రహదారి పక్కన పైప్‌లైన్ వేసి చిల్కూరి లక్ష్మీనగర్ వద్ద నిర్మించే ఎస్టీపీకి అనుసంధానం చేయనున్నారు. అక్కడ మురుగును శుద్ధి చేసి చాందా వాగులోకి వదలనున్నారు. పైప్‌లైన్ ద్వారా మురుగును తరలించే విధానం కార్యరూపం దాల్చితే ఖానాపూర్ కాలనీవాసులకు ఊరట లభించనుంది. మూడు దశాబ్దాలుగా అక్కడ స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకుని నివసిస్తున్న తమను వేరేచోటకు తరలిస్తారేమోనన్న ఆందోళనలో ఉన్న స్థానికులకు ప్రభుత్వ నిర్ణయం ఊరటనిచ్చింది.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, చిత్రంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

అట్రాసిటీ చట్టం దుర్వినియోగం కాకుండా చర్యలు : ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూరు, న్యూస్‌టుడే : ఎస్సీ, ఎస్టీ చట్టం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. చట్టంపై గ్రామస్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శుక్రవారం ఉట్నూరు సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అధ్యక్షతన నిర్వహించిన డివిజన్ స్థాయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అట్రాసిటీ కేసు నమోదైనప్పుడు బాధిత కుటుంబానికి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొందరు స్వలాభం కోసం చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. డీఎస్పీ నాగేందర్, తహసీల్దార్ ప్రవీణ్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎదులాపురం: దివ్యాంగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎన్పీఆర్‌డీ(వికలాంగుల జాతీయ వేదిక) పనిచేస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్ పేర్కొన్నారు. 25, 26వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభల్లో భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం జిల్లా కార్యదర్శి షేక్ ఆరిఫాబేగం, నాయకులు శత్రుఘన్, పోచన్న, అనసూయ, నుస్రత్‌బేగం పాల్గొన్నారు.

అభిరుచి.. ఆచరించి



ప్రపంచంలో ఎత్తయిన లెటర్ బాక్సు వద్ద ప్రణయ్‌కుమార్

జిల్లా కేంద్రానికి చెందిన బి.ప్రణయ్‌కుమార్ ఫొటోగ్రఫీ వృత్తిలో కొనసాగుతున్నారు. ఆయనకు ద్విచక్ర వాహనంపైన సాహసోపేత ప్రయాణం చేయడం అభిరుచి. ఇప్పటికే ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ప్రదేశాలు లద్దాఖ్‌లోని ఉమ్‌లింగ్‌లా, ఖార్దుంగ్‌లా పర్వత ప్రాంతాలను సందర్శించారు. ఈ నెల 11న ఆదిలాబాద్ నుంచి బయలుదేరిన ఆయన తాజాగా హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం స్పితి జిల్లాలోని హిక్కిం గ్రామాన్ని 16న చేరుకున్నారు. అక్కడ ప్రపంచంలోనే ఎత్తులో ఉన్న తపాలాశాఖకు చెందిన లెటర్ బాక్సు(సముద్ర మట్టం నుంచి 14,400 అడుగుల ఎత్తు), ఇదే జిల్లాలోని కాజా వద్ద ప్రపంచంలోనే ఎత్తులో ఉన్న పెట్రోల్ పంపును(సముద్ర మట్టం నుంచి 12,270 అడుగుల ఎత్తు) దర్శించుకున్నారు. ఈ క్రమంలో 2,567 కి.మీ.లు బైక్‌పైన ప్రయాణించానని, మరో అయిదు రోజుల్లో ఆదిలాబాద్ చేరుకుంటానని ఆయన 'న్యూస్‌టుడే'కు ఫోన్‌లో వివరించారు.

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం

ఈ పత్రాలే ఆధారం.. ప్రయోజనాలు అపారం

న్యూస్‌టుడే, చెన్నూరు గ్రామీణం :

మనకు తోడుగా కుటుంబసభ్యులు, బంధుమిత్రులు ఉంటారు. వారికి మించి మన వెంట ఉండాల్సినవి ధ్రువీకరణ పత్రాలు. మనిషి పుట్టుక నుంచి మొదలుకొని మరణం వరకు వీటి అవసరం వెలకట్టలేనిది. దైనందిన అవసరాల్లో జీవితాంతం బాసటగా నిలిచే వీటిని పొందడంలో ఏమాత్రం అలసత్వం చేయకూడదు.



ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు చెన్నూరులోని మీసేవలో దరఖాస్తు సమర్పిస్తున్న తల్లిదండ్రులు

ఆధార్

ప్రస్తుత పరిస్థితుల్లో ఆధార్‌కార్డు లేకుండా ఏ పని జరగదు. బ్యాంకు ఖాతా తెరవాలన్నా.. సిమ్‌కార్డు పొందాలన్నా ఇది తప్పనిసరి. ప్రభుత్వ పథకాలను పొందాలంటే ఆధార్ ఉండాల్సిందే.



✸ **పొందే విధానం:** పిల్లలకు ఆధార్‌కార్డు తీసుకోవాలంటే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. ఆధార్ జారీ చేసే కేంద్రాలకు వెళ్లి జనన ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత దరఖాస్తు ఫారాన్ని ఇవ్వాలి. నిర్వాహకులు పిల్లల ఫొటో, ఇతర వివరాలను తీసుకొంటారు. వారం, పదిరోజుల్లో ఆధార్‌కార్డు పొందవచ్చు.

పాన్‌కార్డు



పాన్‌కార్డు లేకుండా ప్రస్తుతం ఏ బ్యాంకూ రుణం ఇవ్వడం లేదు. ఆదాయ పన్ను చెల్లింపులో ఇది ఎంతో కీలకం. గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుంది. మన ఖాతాలు, రుణాలు, ఆర్థిక పరిస్థితులు దీని ద్వారా తెలుస్తాయి.

✸ ఆధార్‌కార్డు, రెండు పాస్ ఫొటోలతో ఆన్‌లైన్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే పక్షం రోజుల్లో తపాలాశాఖ ద్వారా పాన్ కార్డు వస్తుంది. పాన్‌కార్డు పోతే ఆధార్ కార్డు ద్వారా తిరిగి పొందే అవకాశం ఉంటుంది.

ఓటరు గుర్తింపు పత్రం



భారత రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పిస్తోంది. ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఇది అవసరం.

దరఖాస్తు ఇలా : వయసును నిర్ధారించే ఏదైనా ధ్రువీకరణ పత్రంతో ఒక పాస్‌ఫొటో, ఫారం-6ని పూర్తిచేసి ఆన్‌లైన్ కేంద్రాలతో పాటు చరవాణిలోని ఓటర్‌యాప్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మరణ ధ్రువీకరణ..



ఒక వ్యక్తికి సబంధించిన ఆస్తి, ఆర్థిక, బీమా, తదితర ప్రయోజనాలను ఆ కుటుంబసభ్యులు పొందాలంటే మరణ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. గ్రామాల్లో అయితే పంచాయతీ కార్యదర్శి, పట్టణాలు, నగరాల్లో పురపాలికలు, కార్పొరేషన్ల ద్వారా తీసుకోవచ్చు.

✸ మరణించిన వ్యక్తి ఆధార్‌కార్డు, అతని పాస్‌ఫొటో, ఒక ప్రభుత్వ ఉద్యోగి ష్యూరిటీ తీసుకోవాలి. దరఖాస్తు చేసే కుటుంబసభ్యుడి ఆధార్‌కార్డుతో మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేస్తే విచారణ అనంతరం జారీ చేస్తారు.

జనన ధ్రువీకరణ ఇలా..

శిశువు పుట్టిన తర్వాత వారి పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలి. ఇది వయసును నిర్ధారించే ధ్రువీకరణ పత్రం. పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించాలంటే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి.

✸ ఆసుపత్రుల్లో జన్మించిన పిల్లల వివరాలను ఆసుపత్రి నిర్వాహకులే స్థానిక సంస్థల కార్యాలయాలకు అందజేస్తారు. తల్లిదండ్రులకు సైతం శిశువు జన్మించిన పత్రం అందజేస్తారు. దీంతో స్థానిక సంస్థల రిజిస్టర్‌లో నమోదైన సంఖ్యను తీసుకొని సంబంధిత ఫారాన్ని పూర్తిచేయాలి. తల్లిదండ్రుల పేర్లు, శిశువుకు పెట్టిన పేరును రాసి మీసేవలో దరఖాస్తు చేస్తే నాలుగైదు రోజుల తర్వాత జనన ధ్రువీకరణపత్రం అందుతుంది.



డ్రైవింగ్ లైసెన్స్



ఇది లేకుండా వాహనాలు నడపొద్దు. తోడుగా లేకపోతే వాహనాల తనిఖీల సందర్భంగా జరిమానా విధిస్తారు. ప్రమాదాలు జరిగినపుడు ఎలాంటి బీమా వర్తించదు.

✸ వయసు నిర్ధారణ పత్రంతో పాటు ఆధార్‌కార్డు, చరవాణి నంబరుతో సంబంధిత ఫారాన్ని నింపి ఆన్‌లైన్‌లోనే రుసుం చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న తేదీన రవాణా శాఖ అధికారి(ఆర్టీవో) కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. కార్యాలయంలో ఫొటో తీసుకున్న తర్వాత మొదట లెర్నింగ్ లైసెన్స్ ఇస్తారు. నెల నుంచి ఆరునెలల లోపు తిరిగి స్లాట్‌బుక్ చేసుకొని రవాణా శాఖ అధికారి (ఆర్టీవో) కార్యాలయానికి వెళ్తే పరీక్ష నిర్వహిస్తారు. అందులో ఉత్తీర్ణత సాధిస్తే డ్రైవింగ్ లైసెన్స్ జారీ అవుతుంది.

పేరు తప్పు రాకుండా చేసుకోవాలి

మీ దగ్గర అన్ని కార్డులు ఉండొచ్చు, కానీ వాటిల్లో ఏమాత్రం పేరు తప్పు దొర్లినా ఆ కార్డు నిరుపయోగమే అవుతుంది. అన్నికార్డుల్లో, బ్యాంకు ఖాతాల్లో పేర్లు ఒకే రకంగా ఉండాలి. జనన ధ్రువీకరణపత్రం లేదా పదోతరగతి మెమోలో ఉన్న పేరులో ఏవైతే అక్షరాలు ఉన్నాయో అవే ఉండేలా చూసుకోవాలి.

దండారీ ఉత్సవాలకు సన్నద్ధం..



నెమలి ఈకల టోపీని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్న యువకులు

దీపావళి పండగ సమీపిస్తుందంటే ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో సందడి మొదలవుతుంది. ఆదివాసీలు ఎంతో పవిత్రంగా భావించే ఈ పండగ సందర్భంగా తండాల్లో దండారీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడమే కారణం. పండగకు మూడు రోజుల ముందే భోగీ నిర్వహించిన తర్వాత ఆదివాసీ వాయిద్యాలైన డోల్, డోల్కీ, వెట్టె, తబలా, సూర్నా, డప్పులు, నెమలి ఈకలకు ప్రత్యేక పూజలు చేస్తారు. పండగ రోజు ఏత్మసూర్ పేన్ (శివుడు-విష్ణు-బ్రహ్మ), ఇతర దేవతల వేషాలతో గుస్సాడీలుగా అలంకరించుకుని ఆక్డా దేవతకు పూజలు చేసి గుస్సాడీ దండారీ వేడుకలు నిర్వహిస్తారు. నెమలి ఈకలతో టోపీ తయారు చేసి ఉత్సవాల్లో నృత్యాలు చేయడం ఇక్కడి ప్రత్యేకత. ఈక్రమంలో పక్షం రోజుల ముందు నుంచే నెమలి ఈకలను సేకరించి టోపీలు తయారు చేయడంలో పెద్దలు నిమగ్నమవుతుంటారు.

- న్యూస్‌టుడే, నార్నూర్

సృజనాత్మకత చాటి.. జాతీయస్థాయిలో మెరిసి



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: చదివేది తొమ్మిదో తరగతే అయినా.. తనలోని ప్రతిభతో జాతీయస్థాయి పోటీల్లో రాణించింది. తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచింది. ఫెయిర్‌గేజ్ ద్వారా ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన పోటీల్లో ఆమె నగదు బహుమతికి ఎంపికవడం విశేషం. వివరాలిలా ఉన్నాయి. స్థానిక వేదం గ్లోబల్ పాఠశాలకు చెందిన చిన్నోల్ల ప్రశస్తిని ఇండియా యాజ్ ఐ సీ-2024 పోటీలో భాగంగా 'పవిత్ర స్వేచ్ఛ' అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో ఉత్తమంగా నిలిచింది. సృజనాత్మకతను చాటుతూ ఆమె రాసిన వ్యాసం మూడోస్థానం దక్కించుకుంది. ఈ మేరకు నిర్వాహకులు రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థ ఇండియా ఈజ్ అస్ భాగస్వామ్యంతో జరిగిన ఈ పోటీ విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు, నాటి పోరాటయోధుల జీవిత విశేషాలను తెలియజేయడానికి, స్వేచ్ఛ-స్వాతంత్ర్యం విలువ చాటిచెప్పడమే లక్ష్యంగా సాగింది. దేశవ్యాప్తంగా వందలాది మంది పోటీపడిన కాంపిటీషన్‌లో నిర్మల్ జిల్లా విద్యార్థిని తృతీయస్థానంలో నిలవడంపై కలెక్టర్ అభిలాష అభినవ్ అభినందించారు. శుక్రవారం తన కార్యాలయానికి వచ్చిన విద్యార్థినితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ భూపాల్, ఉపాధ్యాయురాలు ప్రవళిక పాల్గొన్నారు.

నూతన కోర్సుల ఏర్పాటుకు కృషి



భోజనశాలలో భోజనం చేస్తున్న ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర ఆర్జీయూకేటీలో సాంకేతిక విద్యతోపాటు నూతన కోర్సుల ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్ చెప్పారు. తొలిసారి విశ్వవిద్యాలయానికి వచ్చిన ఆయనకు పరిపాలన విభాగం అధికారి రణధీర్, ఆయా విభాగాల అధ్యాపకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయా విభాగాల అధ్యాపకులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆర్జీయూకేటీ పరిస్థితి, విద్యార్థుల వివరాలు, విభాగాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎవరికీ చెప్పకుండా నేరుగా భోజనశాలకు వెళ్లి భోజనం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం వంటగది, సరకులను పరిశీలించారు. వంటగది అపరిశుభ్రంగా ఉండటంతో శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఆయా విభాగాలకు వెళ్లి అధ్యాపకులతో మాట్లాడారు. వారి సమస్యలను స్వయంగా చూశారు. ఇక్కడ పనిచేసి బయటకు వెళ్లిన అధ్యాపకులు, సిబ్బందికి ఇచ్చిన గదులను వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.

ఆర్జీయూకేటీని అగ్రగామిగా తీర్చిదిద్దుతా

'న్యూస్‌టుడే'తో ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్



ముథోల్(బాసర), న్యూస్‌టుడే:

విద్యార్థుల అసౌకర్యాలను, విద్యాపరంగా నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ ఆర్జీయూకేటీని అగ్రగామిగా తీర్చిదిద్దుతానని ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్ చెప్పారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శుక్రవారం బాసర ఆర్జీయూకేటీకి వచ్చారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ఆయా విభాగాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ అంశాలపై 'న్యూస్‌టుడే' ఉపకులపతితో ముఖాముఖి నిర్వహించింది.



? విశ్వవిద్యాలయంలో నెలకొన్న సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటి పరిష్కారానికి ఏం చర్యలు చేపట్టబోతున్నారు?

ఇక్కడ సమస్యలను పరిష్కరించడానికి నాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించారు. తొలుత విద్యార్థుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తాను. మిగతా వాటిని దశల వారీగా తీర్చడానికి కృషి చేస్తా. అయితే ఇందుకు కొంత సమయం పడుతుంది. విశ్వవిద్యాలయాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి శాయశక్తులా పాటుపడుతాను.

? విద్యార్థుల ఉద్యమం ఫలితంగానే మీ నియామకం జరిగిందనే దానిపై మీ స్పందనేమిటి?

ఇక్కడి సమస్యలను తీర్చే బాధ్యతలు నాకు అప్పగించారు. నమ్మకంతో పనిచేస్తాను. ఆకస్మిక తనిఖీలు చేపడతాను. తప్పిదాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాను. ఇక్కడికి రాగానే నేరుగా భోజనశాలకు వెళ్లి విద్యార్థులతో కలిసి భోజనం చేశాను. పరిస్థితులు గమనించాను. అన్ని విభాగాలను పరిశీలించి సలహాలు, సూచనలను అందజేస్తాను. ఏ సమస్య ఉన్నా విద్యార్థులు నన్ను నేరుగా కలవొచ్చు. లేదంటే చరవాణిలో చెప్పొచ్చు.

? నాలుగేళ్లుగా ఏకరూప దుస్తులు, ల్యాప్‌టాప్‌లు, బూట్లు అందజేయడం లేదు.

ఇది ఆర్థికపరమైన సమస్య. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది.

? విద్యార్థి సంఘం కార్యవర్గానికి ఆమోదం తెలపడం లేదని గతంలో ఆందోళన చేశారు. దీనిపై మీ వైఖరి ఏమిటి?

నేను విద్యార్థుల మధ్యనే ఉంటాను. వారికే సమస్య వచ్చినా అండగా ఉండి పరిష్కరిస్తాను. సంఘం విషయంలో విద్యార్థులను పిలిచి మాట్లాడతాను.

? ఉపకులపతులు హైదరాబాద్ నుంచి పర్యవేక్షణ చేస్తారనే విమర్శలు ఉన్నాయి..?

నేను ఎక్కువ సమయం బాసరలోనే ఉంటాను. విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి సమయం కేటాయిస్తాను. వారి ఇక్కట్లను గమనించి తీర్చే యత్నం చేస్తాను. నేను కూడా వసతి గృహాల్లోనే ఉండి చదువుకొని ఉన్నతోద్యోగం చేస్తున్నాను. సమస్యలపై అవగాహన ఉంది.

? ఆరువేల మంది విద్యార్థినులకు ఆరుగురే కేర్‌టేకర్లు ఉన్నారు. వీరి సంఖ్య పెంచుతామని చెప్పినా ఆచరణలోకి రాలేదు?

ఈ సమస్య నా దృష్టికి వచ్చింది. దీనిపై సమీక్ష సమావేశంలో చర్చిస్తాం. ఏ విధంగా నియామకాలు చేపట్టాలన్న దానిపై ప్రభుత్వానికి నివేదిక అందజేసి సాధ్యమైనంత త్వరగా చర్యలు చేపడతాం.

? అందరూ తాత్కాలిక అధ్యాపకులే.. అందులోనూ సగానికి పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భర్తీకి ఏం చేస్తారు?

బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీల వివరాలు సేకరించాను. వాటిపై ఉన్నతాధికారులతో మాట్లాడతాను. సాధ్యమైనంత త్వరగా ముఖ్యమైన పోస్టుల భర్తీకి ప్రయత్నాలు చేస్తాను.

నలుగురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు

● 900 కిలోల గంజాయి కేసులో సూత్రధారులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద గత నెలలో రూ.2.25 కోట్ల విలువైన 900 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. అప్పుడు 8 మందిపై కేసు నమోదు చేశారు. ఐచర్ కంటైనర్ డ్రైవర్ వసీం, క్లీనర్ అర్మాన్‌లను అదే రోజు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలో వారిని శుక్రవారం అరెస్టు చేశారు. గ్రామీణ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. సెప్టెంబరు 20న ఆంధ్రా - ఒడిశా సరిహద్దు నుంచి మహారాష్ట్రకు ఐచర్ వాహనంలో గంజాయిని ఆదిలాబాద్ మీదుగా తరలిస్తున్నారు. ఐచర్ వాహనంలో డ్రైవర్ వసీం, క్లీనర్ అర్మాన్ ఉన్నారు. వీరికి ఎస్కార్ట్‌గా వ్యాన్‌లో ముగ్గురు శుభం సాబ్లె, అమర్‌సింగ్, సోమనాథ్ ఉన్నారు. పోలీసులను చూసి వారు పరారయ్యారు. వీరు మహారాష్ట్రలోని బుల్దాన, జెల్గాన్ జిల్లాలకు చెందిన వారు. ప్రత్యేక పోలీసు బృందం వారిని అక్కడ అరెస్టు చేశారు. వీరితో పాటు వ్యాపారి గోతిరాం గురుదయాళ్‌సాబ్లెను కూడా అరెస్టు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ మొత్తంలో మొదటిసారి గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారులైన ఒడిశాకు చెందిన అశీష్, పండిత్, సోనూ అన్సారీ, అన్షుజైన్, మరి కొంత మందిని పట్టుకునే వరకు ప్రత్యేక బృందం కార్యాచరణ కొనసాగిస్తుందన్నారు. ఈ కేసులో కృషి చేసిన జైనథ్, ఆదిలాబాద్ గ్రామీణ సీఐలు సాయినాథ్, ఫణిదర్‌తో పాటు గ్రామీణ ఎస్‌ఐ ముజాహిద్, సిబ్బంది రుక్మారెడ్డి, గంగాధర్‌రెడ్డి, శ్రీనివాస్, సిబ్బంది, తదితరులను జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించినట్లు పేర్కొన్నారు.

☛ ఈయన పేరు టేకం లక్ష్మణ్(22). ఉట్నూరు మండలం బొప్పరికుంట గ్రామం. రెండు నెలల కిందట ఉట్నూరు నుంచి గ్రామానికి వెళ్తుండగా రహదారికి అడ్డంగా ఉన్న వాగులో గల్లంతై మృత్యువాతపడ్డాడు. ఏటా వాగులు దాటుతూ ప్రాణాలు కోల్పోతున్నా.. వాగులపై వంతెనలు నిర్మించడం, రహదారులను బాగు చేయడం మాత్రం కరవైంది.



☛ కొన్నేళ్ల కిందట వంకతుమ్మ(ఏ) గ్రామానికి చెందిన కొడప ఎత్మాబాయికి పురిటినొప్పులు రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్దామంటే గ్రామం నుంచి వెళ్లే మార్గంలోని వాగుపొంగి ప్రవహించింది. గ్రామస్థులు ఎన్ని ప్రయత్నాలు చేసినా సఫలం కాలేదు. ఎత్మాబాయి మృతి చెందిందని ఆమె తల్లి సాక్రుబాయి బోరుమంది.



☛ కుమురం భీం జిల్లా కెరమెరి మండలం లక్మాపూర్, గోరియగూడ, పరందోలి, మహరాజ్‌గూడ, మకద్దంపూర్, కొలాంగూడ గ్రామాల్లో 1500 మందికిపైగా నివసిస్తున్నారు. ఈ గ్రామాలకు వెళ్లే మార్గమధ్యలో లక్మాపూర్, గోరియాగూడ వాగులు ప్రవహిస్తున్నాయి.



గోరియగూడ, పరందోలి, మహరాజ్‌గూడ గ్రామాలకు వెళ్లాలంటే ఈ వాగు కష్టాలు తప్పవు

జాలి కాదు.. దారి చూపండి!

● గ్రామీణుల ని'వేదన'..

న్యూస్‌టుడే, ఉట్నూరు

భారీ వర్షాలు కురవగానే.. వాగులు పొంగి అనేక గ్రామాలలో రహదారులు ముంపునకు గురవుతున్నాయి. గ్రామస్థులకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగి వాగులు దాటే క్రమంలో ప్రాణాలు కోల్పోయే ప్రమాదకరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సమస్యను చూసి ప్రజాప్రతినిధులు, అధికారులు జాలి చూపడం తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదనే విమర్శలొస్తున్నాయి.

వర్షాకాలం వచ్చిందంటే గిరిజన ప్రాంతాల్లో వాగులు పొంగి ప్రవహిస్తూ.. రాకపోకలు నిలిచిపోతున్నాయి. గూడేలు, తండాలలోని గర్భిణులు ప్రసవ వేదన, అనారోగ్యం, అత్యవసర పరిస్థితి ఏదైనా సాహసం చేయాల్సిందే. అన్ని సందర్భాల్లో ప్రాణాలు దక్కుతాయనే ఆశలేదు. వాగుల కారణంగా అనేక గిరిజన గ్రామాలకు '108' వంటి అత్యవసర వాహనాలు వెళ్లలేకపోతున్నాయి. విషజ్వరాలు, ప్రసవ వేదనతో సకాలంలో ఆసుపత్రికి చేరలేక మృత్యువాత పడుతున్నారు. వాగులపై వంతెనలను నిర్మిస్తేగానీ ప్రాణాలకు భరోసా ఉండదు.



ప్రమాదకరంగా మారిన వాగును పరిశీలిస్తున్న ఎస్‌ఐ మనోహర్, పోలీసుల బృందం

☛ ఇంద్రవెల్లి మండలం మామిడిగూడ, దుబ్బాగూడ గ్రామాలకు వెళ్లే మార్గమధ్యలో వడ్‌గావ్, ముత్నూర్ వాగులు వస్తాయి. వానాకాలంలో వాగులు పొంగి బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. వీటితో పాటు గోపాల్‌పూర్, కన్నాపూర్‌తండ, జైత్రంతండా, డొంగర్‌గావ్‌లలో రేషన్ బియ్యం కూడా తెచ్చుకోలేని పరిస్థితి.

అనుమతుల పేరిట..

ఉట్నూరు నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉండే వంకతుమ్మ(ఏ), వంకతుమ్మ(బి) గ్రామాలకు వెళ్లడానికి కనీసం రోడ్డులేదు. గతంలో ఉపాధి హామీ పథకంలో తాత్కాలికంగా మొరం రోడ్డు వేశారు. వర్షానికి అది కొట్టుకుపోయింది. మార్గమధ్యలో రెండు వాగులు ప్రవహిస్తున్నాయి.




నర్సాపూర్(జే) గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో వాగు

రెండు గ్రామాల్లో 700 జనాభా ఉంటుంది. 108, 104 వెళ్లలేని పరిస్థితి. ఇలా వైద్యం అందక ఈ గ్రామాలలో చాలా మంది మృత్యువాతపడ్డారు. వంకతుమ్మ(ఏ) గ్రామానికి, నర్సాపూర్(జే) గ్రామాలకు ఈ సమస్యలను తీర్చేందుకు ప్రభుత్వం బీటీ రహదారిని మంజూరు చేసినా అనుమతుల పేరిట పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు.

రేపు ఉమ్మడి జిల్లా ఖోఖో ఎంపిక పోటీలు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం లోలం గ్రామంలోని లిటిల్ స్కాలర్స్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉమ్మడి జిల్లా ఖోఖో బాలబాలికల జూనియర్స్ విభాగం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంద్రత్ ఈశ్వర్, ఎన్.శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఆసక్తిఉన్న క్రీడాకారులు ఉదయం 10 గంటలకు తమ ఆధార్, బోనఫైడ్ ధ్రువపత్రం, పదో తరగతి మెమోతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సురేశ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాకేశ్‌కు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఈ నెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. 22.11.2006 తర్వాత జన్మించిన వారై ఉండాలని, వివరాల కోసం చరవాణి 93984 30685లో సంప్రదించాలని వివరించారు.

కుంటాల ఏఓగా విక్రమ్



కుంటాల, న్యూస్‌టుడే: కుంటాల వ్యవసాయాధికారిగా దిలారి విక్రమ్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఉద్యోగ విధుల్లో ఇటీవల నూతనంగా చేరారు. ఇప్పటి వరకు భైంసా అర్బన్ ఏఓ ఆసం రవి అదనపు బాధ్యతలు చేపట్టారు.

న్యూస్‌టుడే, బేల

? బేల ప్రాథమిక పాఠశాల మైదానంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కావడంతో నీరంతా మైదానంలో వృథాగా పోతోంది. విద్యార్థులకు అసౌకర్యంగా ఉంది. లీకేజీని సరి చేసి సమస్యను పరిష్కరించాలి.
- అడెల్లు, విద్యార్థి తండ్రి

✔ వెంటనే పైప్‌లైన్ లీకేజీ సమస్యను పరిష్కరిస్తాం.
- సురేష్, పంచాయతీ కార్యదర్శి, బేల

భగీరథ లీకేజీకి మరమ్మతులు



జైనథ్, న్యూస్‌టుడే: బెల్గాం సమీపంలో వంతెన కింద మిషన్ భగీరథ లీకేజీకి సిబ్బంది మరమ్మతులు చేశారు. కొన్ని రోజులుగా లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారు కరవయ్యారని ఈ నెల 16న 'ఈనాడు'లో 'భగీరథ లీకేజీ' శీర్షిక చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన భగీరథ ఏఈ రాహుల్ సైనీ, పర్యవేక్షకుడు విద్యాసాగర్ పరిశీలించి సిబ్బందితో మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు.

వందనం

మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభం



తలమడుగు, న్యూస్‌టుడే: తలమడుగు జిల్లా పరిషత్తు సెకండరీ పాఠశాలలో 330 మందికి మరుగుదొడ్లు లేక ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో వచ్చిన వరుస కథనాలపై కలెక్టర్ రాజర్షిషా స్పందించారు. ఉపాధి పథకం కింద రూ.20 లక్షలతో పాఠశాల ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణం త్వరగా ప్రారంభం కావాలని పంచాయతీరాజ్ ఈఈ శివరాం ఆదేశించారు. పాఠశాలకు చేరుకుని స్థలాన్ని ఎంపిక చేసి గుత్తేదారుతో పనులు చేయించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు 'ఈనాడు'కు కృతజ్ఞతలు తెలిపారు.

నేర వార్తలు

పురుగుమందు తాగి యువకుడి ఆత్మహత్య

తాంసి, న్యూస్‌టుడే: పురుగుమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం తాంసి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై శివరాం వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ శాంతినగర్ కాలనీకి చెందిన యువకుడు హరికృష్ణ(27) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఇంట్లోంచి బయలుదేరాడు. మధ్యాహ్నం సమయంలో తాంసి మండలం మత్తడివాగు ప్రాజెక్టు సమీపంలో చేను వద్ద పురుగుమందు తాగి, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్కనే వ్యవసాయ కూలీలు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకొని బలవన్మరణం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: మావల మండలం వాఘాపూర్ కొలాంగూడ అటవీ ప్రాంతంలో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వెలుగు చూసింది. ఎస్సై విష్ణువర్ధన్ వివరాల మేరకు.. గుడిహత్నూర్ మండలం ముత్నూర్‌కు చెందిన కొడప మాణిక్‌రావు కొలాంగూడకు చెందిన సంగీతను ఎనిమిదేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి కొలాంగూడలోనే నివాసం ఉంటున్నారు. నాలుగేళ్ల కిందట భార్య ఎటో వెళ్లిపోయింది. కూతురు, కుమారుడితో పాటు అత్తవద్దే ఉంటున్న మాణిక్‌రావు ఈ నెల 13న ఊరికెళుతున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కొలాంగూడకు చెందిన పశువుల కాపరి ఒకరు అటవీ ప్రాంతంలో వ్యక్తి ఉరేసుకున్నట్లు గమనించి సమాచారం అందించటంతో ఘటన వెలుగు చూసింది. ఎక్కువగా గుట్కా నములడం వల్ల నోటి క్యాన్సర్ బారిన పడి మనస్తాపంతో ఉరేసుకున్నట్లు అతని బావమరిది కొడప చెన్ను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో...

ఆదిలాబాద్ నేర విభాగం: ఆదిలాబాద్ పట్టణం భుక్తాపూర్‌కు చెందిన ఎనుగంటి హన్మంతు(35) శుక్రవారం సాయంత్రం ఇంట్లోనే ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. అతడి భార్య సైతం మూడేళ్ల కిందట ఉరేసుకొని మృతి చెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసగా మారాడు. ఇంటి వద్ద సాయంత్రం మద్యం మత్తులో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నకిలీ బంగారం కేసులో మరొకరి అరెస్టు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: నకిలీ బంగారం అంటగడుతూ ప్రజలను మోసం చేస్తున్న ముఠాలోని మరో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఈ నెల 6న ఒక లాడ్జికి వచ్చి సందర్శకుల వివరాలు ఉన్న రిజిస్టర్‌ను ముఠా సభ్యులు చోరీ చేయగా ఆదే రోజు పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉండగా కర్నూలు జిల్లా డోన్ మండలం కొత్తబురుజు గ్రామానికి చెందిన ఎరుకల సుధాకర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ ముఠాలోని మరో ఇద్దరి కోసం గాలిస్తున్నామన్నారు.

గంజాయి విక్రేతలు...

ఆదిలాబాద్ నేర విభాగం: గంజాయి విక్రేతలు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఇంద్రవెల్లి మండలం అందూరావుపేటతండాకు చెందిన ఎడవాల కర్తార్‌సింగ్ పండించిన గంజాయిని తరచూ కొనుగోలు చేసి ఆదిలాబాద్‌లో సయ్యద్ సమీర్(కేఆర్‌కే కాలనీ), ఒడ్డెవెల్లి రాజేశ్వర్(కేఆర్‌కే కాలనీ) విక్రయిస్తుంటారని ఎస్సై పేర్కొన్నారు. శుక్రవారం వారు ముగ్గురు కలిసి గంజాయిని విక్రయించే క్రమంలో కేంద్రీయ విద్యాలయం సమీపంలో అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. 70 గ్రాముల ఎండు గంజాయి గుర్తించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు.

జూదరులు...

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండలం శంకర్‌గూడ పంచాయతీ పరిధిలోని వ్యవసాయ చేనులో జూదమాడుతున్న ఏడుగురిని ఆదిలాబాద్ సీసీఎస్ సీఐ చంద్రశేఖర్ బృందం దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఆదిలాబాద్ నేర విభాగం: ఆదిలాబాద్‌లో నిర్వహిస్తున్న జూదస్థావరంపై శుక్రవారం టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు, పోలీసులు రమేష్, క్రాంతి, నరేందర్, ప్రవీణ్, గోపాల్‌లు శుక్రవారం దాడులు చేశారు. జూదమాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ధనోర(బి)లో చోరీ

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: ఇంద్రవెల్లి మండలం ధనోర(బి)కి చెందిన చవాన్ రాము ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. బీరువాలో రూ.12 వేలతో పాటు 5 గ్రాముల బంగారం, 5 తులాల వెండిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

గాదిగూడ ఎస్సై హెడ్‌క్వార్టర్‌కు అటాచ్

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: గాదిగూడ పోలీసు స్టేషన్ ఎస్సై మహేశ్‌ను ఆదిలాబాద్ పోలీసు హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సై మహేశ్ ఈ నెల 11న తన కారును నిర్లక్ష్యంగా నడుపుతూ బేలకు చెందిన షేక్ ఆతీఖ్‌ను ఢీకొట్టడంతో ఆతడి కాలు నుజ్జునుజ్జు అయింది. ఎస్సైపై ఈ నెల 14న నార్నూర్ సీఐ పాపుకు ఫిర్యాదు చేశారు. అదే రోజు ఎస్సైపై కేసు నమోదు చేశారు. క్రమ శిక్షణ చర్యల్లో భాగంగా హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేశారు.

ఎవరి జాబితా?

తెగని ఇందిరమ్మ కమిటీల పంచాయితీ

పది మండలాల్లో, మున్సిపాలిటీలో పోటీ..



న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం: జిల్లాలో ఇందిరమ్మ కమిటీల పంచాయితీ ఇంకా తెగలేదు. ఇది వరకే కాంగ్రెస్ పార్టీ నేతల నుంచి గ్రామాలవారీగా అధికారులకు జాబితాలు రాగా విపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాజాగా బోథ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు సైతం గ్రామాల వారీగా మరో జాబితా పంపించడం, ఇటు కాంగ్రెస్ జాబితాలు ఉండడంతో కమిటీ ఎంపిక అధికారులకు తలనొప్పిగా మారింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి తుది ఆమోదం తెలపాల్సి ఉండగా ఈ అంశాన్ని అధికారులు ఆమె దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిసింది.

ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు ఇచ్చే ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఈ కమిటీలు కీలకంగా మారనుండటంతో సభ్యుల నియామకాల్లో పోటీ నెలకొంది. పలు చోట్ల కాంగ్రెస్ పార్టీలోనే నేతల మధ్య వైరానికి దారి తీసింది. పాత, కొత్త కాంగ్రెస్ నేతల మధ్య పోటీతో పలు గ్రామాల్లో రెండుమూడుసార్లు జాబితాలు మార్చారు. భాజపాకు చెందిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్‌శంకర్, భారాసకు చెందిన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ కమిటీల ఎంపిక తీరును తీవ్రంగా తప్పుపట్టడంతోనే ఇది ఎటూ తేల్చని అధికారుల మెడకు చుట్టుకుంటోంది.

జిల్లాలోని 17 గ్రామీణ మండలాల్లో ప్రస్తుతానికి పది మండలాల్లోనే ఎంపిక వ్యవహారంలో పోటీ నెలకొంది. ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధి బేల, జైనథ్ మండలాల్లోని గ్రామాల్లో కాంగ్రెస్ వర్గాల నుంచి జాబితాలతో పాటు ఇటు భాజపా నుంచి కొన్ని పేర్లు అధికారులకు పంపించినట్లు తెలిసింది. రెండు మండలాల్లో వివాదాలు రాకుండా అధికారులు కొంతవరకు సర్దుబాటు చేసినట్లు చెబుతున్నారు. మిగతా ఆదిలాబాద్ గ్రామీణ మండలంలో మాత్రం ఇటు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, మరోవైపు భాజపా ఎమ్మెల్యే పాయల్‌శంకర్ జాబితా ఉండటంతో అధికారులు ఎంపిక బాధ్యతను మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిసింది. ఇదే నియోజకవర్గ పరిధిలోని ఆదిలాబాద్ మున్సిపాలిటీలో 49 వార్డుల వారీగా కాంగ్రెస్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్‌రెడ్డి జాబితా ఒకటి పుర కమిషనర్‌కు రాగా భారాసకు చెందిన పుర అధ్యక్షుడు జోగు ప్రేమేందర్ సూచనతో ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లు వార్డులవారీగా జాబితాలు కమిషనర్‌కు అందించారు. మరోపక్క భాజపా ఇతర అన్ని పార్టీలకు చెందిన కౌన్సిలర్లు సైతం వార్డుల వారీగా పేర్ల జాబితాలు కమిషనర్‌కు అందించారు. ఒక్కొవార్డు నుంచి ఈ రెండు జాబితాలు ఉండటంతో ఎంపిక పంచాయితీ కలెక్టర్ వరకు వెళ్లింది.

● బోథ్ నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆడె గజేందర్, ఇతర నేతలు సూచించిన పేర్లతో జాబితాలు రూపొందించారు. తాజాగా భారాసకు చెందిన ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సూచనతో ఆయన అనుచరులు సైతం గ్రామాల వారీగా ఎంపీడీఓలకు జాబితాను పంపించడంతో ఇక్కడ రెండు జాబితాలు రావడంతో ఎంపిక తలనొప్పిగా మారింది.

● ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఇంద్రవెల్లి, ఉట్నూరుతో పాటు ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని నార్నూర్, గాదిగూడ మండలాల్లో అంతగా అభ్యంతరాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. ఎంపిక బాధ్యత మంత్రిపైనే ఉండటంతో పోటీ ఉన్న గ్రామాల్లో ఏమవుతుందోనని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



మాల సంఘం నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న చెన్నయ్య

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటం ఉద్ధృతం చేస్తామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన బస్సు యాత్ర శుక్రవారం జిల్లాకు చేరుకుంది. అంబేడ్కర్ భవన్‌లో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ షెడ్యూల్ కులాలను ఒకటిగా చేర్చి ఐక్యంగా ఉండాలని కోరుకుంటే మందకృష్ణ మాదిగ ఎస్సీలను విడిపోయేందుకు పోరాడటం సమంజసం కాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణపై ఉన్న శ్రద్ధ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై లేదని విమర్శించారు. 24న హైదరాబాద్‌లో నిర్వహించే మాలల భారీ బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. కోకస్వీరయ్య రవి, రమేశ్, కరుణాకర్, రాజేశ్వర్, రాంచందర్, రాములు, కిషన్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరుపై హర్షం



శ్రీనివాస్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ నియోజకవర్గానికి సీఆర్ఆర్ పథకం కింద రూ.10 కోట్లు, ఎస్డీఎఫ్ పథకం కింద రూ.4 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిధుల మంజూరుకు కృషి చేసిన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. స్థానిక భాజపా ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్లు జహీర్ రంజానీ, కలాల శ్రీనివాస్, బండారి సతీష్, సంద నర్సింగ్, గిమ్మ సంతోష్, మునిగెల నర్సింగ్, రామ్‌కుమార్, ఎవాన్, షేక్ తదితరులు పాల్గొన్నారు.

బోథ్‌లో ముస్లిం ఐకాస నిరసన

బోథ్, న్యూస్‌టుడే: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బోథ్‌లో ముస్లిం ఐకాస ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. శుక్రవారం ముస్లిం వ్యాపారాలు బంద్ పాటించారు. మసీదులో నినాదాలు చేస్తూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. సీఐ రమేష్, ఎస్సై ప్రవీణ్‌లకు వినతిపత్రం అందజేశారు.

గుజరాత్ తరహాలో పత్తికి ధర కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భారాస జిల్లా అధ్యక్షుడు రామన్న

జైనథ్, న్యూస్‌టుడే: గుజరాత్ తరహాలో ఆదిలాబాద్‌లో పత్తికి ధర కల్పించాలని భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్‌లో పత్తికి ధర తక్కువ కరెక్టుగా కేంద్రంపై స్థానిక భాజపా, ఎంపీలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 24న రాంలీలా మైదానంలో నిర్వహించనున్న సభకు కేటీఆర్ హాజరవుతున్నారన్నారు. సభను విజయవంతం చేసేందుకు మండలంలోని సాత్నాల వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మాజీ ఎంపీపీలు రమేష్, గోవర్ధన్, మాజీ వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, నాయకులు నారాయణ, పెందూర్ దేవన్న, భరత్, క్రాంతి, గంగయ్య, రేణుకాబాయి తదితరులు పాల్గొన్నారు.

సీడీఓను సన్మానించిన డీఎస్పీ



కోర్టు విధుల అధికారి రాకూర్ రవీందర్‌సింగ్‌ను సన్మానిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ సునీల్‌కుమార్

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ వన్ టౌన్ కానిస్టేబుల్(సీడీఓ-కోర్టు విధుల అధికారి) రాకూర్ రవీందర్‌సింగ్‌ను ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ సునీల్‌కుమార్ శుక్రవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సన్మానించారు. 2021లో జరిగిన ఆరేళ్ల బాలికపై అత్యాచారం కేసులో అవసరమైన ఆధారాలు సేకరించి సాక్షులను ప్రవేశపెట్టి నేరస్థుడికి శిక్ష పడేలా చేసేందుకు ఆయన బహుమతిని అందజేసి సత్కరించారు.

పీఎం విశ్వకర్మ లబ్ధిదారులకు ధ్రువపత్రాలు

సోనాలాపాంగణం: కులవృత్తిదారులకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ప్రధాని మోదీ పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ధ్రువపత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నోడల్ అధికారి పద్మభూషణ్‌రాజు, నాయకులు లాలామున్నా, ఆకుల ప్రవీణ్, రఘుపతి, భరత్, దయాకర్, ఆశోక్‌రెడ్డి, ముకుంద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు భాజపాశ్రేణుల సన్మానం

సోనాలాపాంగణం: ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి సీఆర్ఆర్ గ్రాంట్ కింద రూ.10కోట్లు, ఎస్‌డీఎఫ్ కింద మరో రూ.4కోట్లు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను భాజపాశ్రేణులు, పార్టీ గ్రామ శ్రేణులు శుక్రవారం సన్మానించారు. నాయకులు కటకం రాందాస్, పోతరాజు రమేష్, దరపోల్, గోవర్ధన్, గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనకు శిక్షణ ఐఏఎస్‌లు

ఆదిలాబాద్ పట్టణం: క్షేత్ర పర్యటనకు 21 మంది శిక్షణ ఐఏఎస్‌లు సోమవారం జిల్లాకు రానున్నారు. తొలత వీరు గ్రామాల్లో పర్యటించనున్నారు. మొత్తం నాలుగు బృందాల్లో ఐదుగురు చొప్పున మూడు బృందాలు, మరో బృందంలో ఆరుగురు శిక్షణ ఐఏఎస్‌లు ఉండేలా కార్యాచరణ రూపొందించారు. తాంసి మండలం పొన్నారి, జైనథ్ మండలం పెండల్‌వాడ, బేల మండలం సిర్సన్న, ఆదిలాబాద్ మండలం లోకారి గ్రామాలను వీరి పర్యటన కోసం ఎంపిక చేశారు. నాలుగు రోజులపాటు వీరు అక్కడే బసచేయనున్నారు. అనంతరం ఆదిలాబాద్ మున్సిపాలిటీలో నాలుగురోజులపాటు పర్యటిస్తారు. వార్డు నం.23, 11, 03, 13, 34లను ఎంపిక చేశారు. ఇందులో ఏడైనా నాలుగు వార్డుల్లో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు.

గ్రూప్-2, 3 పరీక్షలకు 29 కేంద్రాలు

సోనాలాపాంగణం: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ గ్రూప్-2, 3 పరీక్షల కోసం జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పాలనాధికారి రాజర్షిషా తెలిపారు. నవంబరు 17, 18 తేదీల్లో గ్రూప్-3, డిసెంబర్ 15, 16 తేదీల్లో గ్రూప్-2 రాత పరీక్షలు జరగనున్న నేపథ్యంలో శుక్రవారం కమిషన్ ఛైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్సు ద్వారా కలెక్టర్లతో పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఆదిలాబాద్ అర్బన్‌లో 14 కేంద్రాలు, రూరల్‌లో నాలుగు, మావలలో 10, జైనథ్‌లో ఒక కేంద్రం ఏర్పాటుచేస్తున్నట్లు పాలనాధికారి వివరించారు. 10,488 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. అదనపు పాలనాధికారి శ్యామలాదేవి, అదనపు ఎస్పీ సురేందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ జగ్రాం తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాదులు మార్గదర్శకులుగా నిలవాలి



జడ్జి హుస్సేన్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

బోథ్, న్యూస్‌టుడే: సీనియర్ న్యాయవాదులు జూనియర్లకు మార్గదర్శకులుగా నిలవాలని జడ్జి హుస్సేన్ అన్నారు. బోథ్‌లోని జూనియర్ సివిల్ కోర్టులో న్యాయమూర్తిగా మూడు సంవత్సరాలు విధులు నిర్వహించి, గురువారం ఆదిలాబాద్ జూనియర్ కోర్టు సివిల్ జడ్జిగా ఆయన బదిలీ అయ్యారు. శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావు, పీపీ శ్రీధర్, ఏజీపీ శంకర్, న్యాయవాదులు సుభాష్, మోహన్‌రావు, అంగద్ కేంద్రె, రూపేందర్, హరీశ్, విజయ్, దమ్మపాల్, విక్రమ్, జమీర్, శరణ్య, కోర్టు సూపరింటెండెంట్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయ అభివృద్ధికి కృషి



దేవికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

బేల, న్యూస్‌టుడే: బేలలో మహంకాళి ఆలయ అభివృద్ధి కోసం రూ.25 లక్షల మంజూరయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. దేవీ నవరాత్రుల పురస్కరించుకుని శుక్రవారం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు దత్త నిక్కం, భాజపా మండల అధ్యక్షుడు నవీన్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు బర్గాడే రాము, ఆలయ కమిటీ నిర్వాహకులు కె.కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

చారిత్రక ప్రదేశాలను సందర్శించాలి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థులు చారిత్రక, పర్యాటక ప్రదేశాలను సందర్శించి సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో టీటీడీసీలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లాలో ఎన్నో చారిత్రక, పర్యాటక ప్రదేశాలున్నాయని, విద్యార్థులు వాటిని సందర్శించి వాటి ప్రాముఖ్యతను తెలుసుకోవడంతో విజ్ఞానం పెంపొందుతుందన్నారు. అధికారులతో కలిసి ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. పర్యాటకశాఖ అధికారి రవికుమార్, డీఈఓ ప్రణీత, డీఐఈఓ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సేవలందించాలి

నార్నూర్, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలోని దళిత, గిరిజన, ఆదివాసీ నిరుపేద ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి సేవలందించాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. కార్యాలయంలో ఏమైనా ఇబ్బంది ఉందా అని ప్రశ్నించగా ప్రమీకరణ పత్రాల కోసం వచ్చే ప్రజలు అధికారులను బెదిరిస్తున్నారని సీనియర్ అసిస్టెంట్ రాథోడ్ లీలా ఫిర్యాదు చేశారు. స్పందించిన సబ్ కలెక్టర్ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తే ఎవరూ ఇబ్బంది పెట్టరన్నారు. ఆర్‌ఐ రాథోడ్ సురేందర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

బేల, న్యూస్‌టుడే: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం సిర్సన్న ఉన్నత పాఠశాలలో అండర్-17 బాలుర స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలను నిర్వహించారు. ఎంఈఓ కోల నర్సింగు, ఎస్జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి కాంతారావుతో కలిసి పోటీలను ప్రారంభించారు. 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం జోనల్‌స్థాయికి జట్టును ఎంపిక చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేంద్ర, వ్యాయామ ఉపాధ్యాయులు సుభాష్, ప్రధానోపాధ్యాయుడు రమేష్, పంచాయతీ కార్యదర్శి సురేష్, మాజీ సర్పంచి భూమన్న, కిష్టారెడ్డి, పీడీ జ్యోతి, జిల్లాలోని పీడీలు పాల్గొన్నారు.

■ ఓడినా నిధుల మంజూరుకు కృషి

ఆదిలాబాద్ అర్బన్: శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి కంది శ్రీనివాస్‌రెడ్డి ఓడిపోయినా నియోజకవర్గ అభివృద్ధికి, నిధుల మంజూరుకు కృషి చేస్తున్నారని పుర మాజీ ఉపాధ్యక్షుడు జహీర్ రంజానీ అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నిసార్లు నెల్లో భారీగా నిధులు తీసుకువచ్చారన్నారు. మైనార్టీ నాయకులు ఖైజర్ పాషా, సయ్యద్ షౌకత్, జాఫర్ అహ్మద్, మొయిన్ అహ్మద్, రెహమాన్, ఖయ్యూం, షేక్ ఖలీం తదితరులు పాల్గొన్నారు.

■ హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

ఆదిలాబాద్ గ్రామీణం: ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ గ్రామీణ మండలం యాపల్‌గూడలో భారాస నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కేటీఆర్ సభను విజయవంతం చేయాలన్నారు. రమేష్, నారాయణ, స్వామి, గంగయ్య, రాంచందర్, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

■ అడవి పందుల దాడిలో పత్తి పంట ధ్వంసం

ఇచ్చోడ(సిరికొండ): సిరికొండ మండలం కుమారికి చెందిన రాజేందర్ మూడు ఎకరాల్లో వేసిన పత్తిపంటను గురువారం రాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయి. పంట చేతికొచ్చిన సమయంలో నాశనం కావడంతో తీవ్రంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.

■ సీనియర్ కార్యకర్తలకు ప్రాధాన్యమివ్వాలి

బోథ్: ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తలకు అవకాశమివ్వాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్, మాజీ ఎంపీపీ చైర్మన్ మల్లె పూల సత్యనారాయణ, సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడు రవి అన్నారు. బోథ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

■ కొనుగోళ్లకు ఏర్పాట్లు

బోథ్: బోథ్ ఏఎంసీ కార్యాలయంలో శుక్రవారం ఛైర్మన్ గంగారెడ్డితో సీసీఐ అధికారులు సమావేశం నిర్వహించారు. పత్తి కొనుగోళ్లపై చర్చించారు. 26 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

■ పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

బోథ్: పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఈఓ ప్రణీత అన్నారు. బోథ్‌లోని కేజీబీవీ, కన్నుట్ల ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, ధన్నూర్ సెకండరీ, ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఎస్ఓ వరీల, ప్రధానోపాధ్యాయులు రాజు పోద్దు, మహేందర్, రావుల శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ సన్మార్గంలో నడవాలి

గుడిహత్నూర్: ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడిచి దైవానుగ్రహం పొందాలని హరిభక్త పారాయణ అర్జున్ శాస్త్రి మహారాజ్ అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా మండలంలోని కొల్హారి పంచాయతీలో నిర్వహించిన అఖండ హరినామ సప్తాహ ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రవచనాలు చేశారు. లింగాపూర్, మంగర్, బోథ్ సహా గుడిహత్నూర్, ముత్నూర్, డొంగ్‌గాఁవ్ తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

■ సుందరకాండ పారాయణం

భీంపూర్: సుందర చైతన్యానంద శిష్యుడు కృష్ణానంద నిపానిలో శ్రీమద్రామాయణంలోని సుందరకాండపై ప్రవచనాలు చేశారు. గ్రామస్థులు ఆసక్తిగా విన్నారు. 20వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 7 గంటల నుంచి 8.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

■ వైద్య సేవలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

తలమడుగు: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ కృష్ణ అన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. శుక్రవారం తలమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య తక్కువగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు శుభ్రంగా లేవని మండిపడ్డారు. వైద్యాధికారి వంశీ, సిబ్బంది సత్యశీల, అనిత, శ్రీనివాస్, ముత్యాలరావు తదితరులు ఉన్నారు.

■ ఫొటోగ్రాఫర్‌కు పురస్కారం

ఉట్నూరు గ్రామీణం: ఫొటోగ్రాఫ్ జీవన్‌పాటిల్‌తో పాటు కళానైపుణ్యాన్ని పెంచుతుందని కలెక్టర్ రాజర్షిషా

సంక్షిప్తం

అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో రాణించిన వారికి బహుమతులు అందజేశారు. ఫొటోగ్రఫీ ప్రదర్శనలో రాణించిన ఉట్నూరుకు చెందిన ఫొటోగ్రాఫర్ మహేశ్‌కుమార్‌ను సన్మానించారు.

■ ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి

బోథ్: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గజేందర్ అన్నారు. బోథ్‌లోని కేజీబీవీ పాఠశాలలో రూ.5 లక్షలతో ప్రహరీ నిర్మాణ పనులు, రూ.5 లక్షలతో అభివృద్ధి పనులను ఏఎంసీ ఛైర్మన్ గంగారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. నాయకులు వంటి, పోతన్న, ఉమేష్, షాకీర్, మహేందర్, నారాయణ, అబ్బాస్, అక్బర్, సురేందర్, షేక్ నాజర్ తదితరులు పాల్గొన్నారు.

■ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

బోథ్: స్థానిక సంస్థల ఎన్నికలకు భాజపా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని భాజపా జిల్లా అధ్యక్షుడు పతంగె బ్రహ్మానంద్ అన్నారు. బోథ్‌లో శుక్రవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. మండల అధ్యక్షుడు రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, నాయకులు పాల్గొన్నారు.

■ బాధిత కుటుంబానికి పరామర్శ

ఇంద్రవెల్లి: కొబ్బాయిగూడకు చెందిన కుర్ర ప్రవత బాయి(30) ఇటీవల పాముకాటుకు గురై మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యులను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి పరామర్శించారు. ఎంపీడీఓ, మాజీ ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

■ చదువుపై దృష్టి సారించండి

ఇంద్రవెల్లి: మారుమూల గిరిజన గ్రామాల్లోని ప్రజలకు దైవ భక్తి ఉండాలని, అదే విధంగా పిల్లలను పాఠశాలలకు పంపి చదివించాలని మండల ప్రత్యేక అధికారి జీవన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆంజి పంచాయతీ పరిధిలోని మామిడిగూడలో గ్రామస్థులు ఇంటింటికి చందాలు వేసుకుని రూ.20 లక్షలతో హను

మాన్ ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపనకు తహసీల్దార్ హాజరయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ బి.రమేష్, విశ్వనాథ్, గ్రామపటేల్ శ్యామ్‌రావు, ఆంధ్ ఆదివాసీ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు విష్ణు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉత్తం, నాయకులు భీంరావు, మారోతి, రాందాస్‌లతో పాటు నార్నూర్, జైనూర్, మహారాష్ట్ర నుంచి భక్తులు హాజరయ్యారు.

■ 20న కుమురం భీం విగ్రహావిష్కరణ

ఇంద్రవెల్లి: హీరాపూర్‌లో ఈ నెల 20న కుమురం భీం విగ్రహావిష్కరణకు జిల్లాలోని వివిధ మండలాల పరిధిలోని ఆదివాసీలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆదివాసీ నాయకులు, తుడుందెబ్బ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం అమరవీరుల స్మారక స్తూపం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. చిత్రు, బారికేరావు, నాయకులు పాల్గొన్నారు.

■ సిరికొండలో భీం వర్ధంతి

ఇచ్చోడ: సిరికొండలో శుక్రవారం ఆదివాసీలు కుమురం భీం వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఉట్నూరు గ్రామీణం: పంచాయతీ పరిధిలోని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత అన్నారు. శుక్రవారం ఆమె ఉట్నూర్ ఎంపీఓ మహేశ్‌కుమార్‌తో కలిసి మండలం నర్సాపూర్ పంచాయతీని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు.

■ పాఠశాలకు టీవీ వితరణ

ఇంద్రవెల్లి: ఏమాయికుంట ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గంగయ్య స్నేహితుడు జక్కుల దత్తు బడికి టీవీని అందజేశారు. శుక్రవారం మండల విద్యాధికారి మనుకుమార్ చేతుల మీదుగా పాఠశాల విద్యార్థులకు అందజేశారు. మాజీ ఎంపీటీసీ లఖన్ పాల్గొన్నారు.

■ గ్రామాల్లో కాంగ్రెస్ నేతల సంబరాలు

బేల: మండలంలో రహదారుల అభివృద్ధి పనులకు ఎస్డీఎఫ్ నిధులు మంజూరు కావడంతో కాంగ్రెస్ నేతలు బేల, సిర్సన్న, చప్రాల, బాది, అవాల్‌పూర్, గూడ, మాంగ్రూడ్, కొబ్బాయి గ్రామాల్లో సంబరాలు నిర్వహించారు.